# మంగమూర్ఖులు

[ఏకాంకరూపకము]

= శ్రీ 'పాప' =

: పాత్రలు :

రామశర్మ — భర్త

గోపాలకృష్ణ — అతని పినతల్లికొడుకు

పద్మావతి — భార్య

[స్థలం : ఒక పట్నవాసంలో ఒక చిన్న వీథిలో మేడమీద గది. గదికి ముందూ, వెనకా వరండా లున్నాయి. వెనకవరండా సగంవరకూ పిట్టగోడ, దానిమీద కటకటాలు. ముందువేపువరండాకి పిట్టగోడమాత్రమే. గదిలోంచి రెండు వరండాలలోకీ తలుపు లున్నాయి. వెనకతలుపుకి కుడిపక్కని తెరచిఉన్న కిటికీ, ఎడమపక్కని మూసిఉన్న కిటికీ. అడ్డుగోడకి మధ్యగా కుడిపక్కని ఒక అలమారు. దానికి ఎదురుగా ఎడమపక్కని సగంమూసిన కిటికీ. కిటికీలోనుంచి పక్కఇంటి పెంకుడుకప్పు ఏటవాలుగా కనబడుతుంది. ముందువైపు వరండాలోకి ఉన్న మేడమెట్లు ఎవరయినా ఎక్కితో ఉంటేమాత్రం చప్పుడవుతాయి. అలవాటుపడిన పట్నవాసపు వాసన (ఫీనయిల్‌తో కడిగిన మూత్రావరణాలూ మొదలయినవాటి వాసన) గాలితోకూడా కలిసి గదిలోకి వ్యాపిస్తోంది. వెనకపక్క కిటికీలోంచి చూస్తే గాలీ, ఆకాశం కొంచెం నల్లగా కనబడతాయి. అల్లిబిల్లిగా ఎలెక్ట్రిక్ తీగలూ, దూరంగా ఒక మిల్లు పొగగొట్టమూ గదిలోవాళ్ల కది పట్నవాసమనే సంగతి జ్ఞాపకంచేస్తూఉంటాయి. గుమ్మానికి ఎదురుగా గదిలో మధ్య రెండుపరుపులు ఒకేపక్కగా వాల్చిఉన్నాయి. ఎడమవేపుగోడకు ఎత్తబడి ఒక కొంపుకాటు, దానిమీద అస్తిమితంగా ఒక పక్కచుట్ట. కుడివేపు గోడదగ్గర ఒక టేబిలు, రెండు కుర్చీలు. ఎడమగోడ మూలలో మాసిన చొక్కాలూ, లాగులూ వగైరా ఒక గుట్టగా పడిఉంటాయి. టేబిలుకింద చిన్న చిన్న చింపివేయబడ్డ కాగితపుముక్కలు. టేబిలుచివర సగం పడిపోబోతో ఒక సిగరెట్టుపెట్టె, దానిమీద ఒక అగ్గిపెట్టె. టేబిలుమీద పుస్తకాల గుట్టమధ్యని పీకదాకా మునిగిపోయి ఒక ఆకుపచ్చడోముగల టేబిలులైటు. కుడిమూల కాల్చిపారవేసిన సిగరెట్టుపీకలూ, వాటి నుసీ. టేబిలుకి సరిగా పైని ఒక ఫోటో, దానికింద ఒక చిన్న అద్దం దువ్వెన్న తగిలించిఉన్నాయి. ఇటూ అటూ దామెర్ల రామారావుబొమ్మలు. వెనకవరండా గుమ్మానికి పైని, గోడమీద, పిరికిమగవాళ్లను భ్రమపెట్టే ఆడబొమ్మ పెద్దది. దానికి ఇటూ అటూ మాటుపడిపోయి ఏవో కొన్ని ఫోటోలు.

కుడివేపుకిటికీకి దగ్గరగా కుర్చీమీద గోపాలకృష్ణ కూర్చున్నాడు, బయటికి చూస్తూ.

ఇరవయిమూడేళ్ల వయస్సు. తగుమాత్రం పొడుగు. గాలి పీల్చేటప్పుడు చెయ్యాలని ముక్కు వెడల్పుచేస్తోఉంటాడు. చిన్న గడ్డం. పరిశుభ్రతకోసం తడుముకుంటున్నట్టుగా పెదవులు అదురుతాయి. కేవలం మధ్యకాకుండా కొంచెం కుడిపక్కకి పాపిడి తీసిన క్రాపు. అక్కడినించి ఎత్తుగా లేచి కెరటాలలా వంపులుతిరిగి చెవులదాకా దిగిపోతుంది జుట్టు. కొంచెం పిరికినరాలు. తన శరీరం ఎక్కడ మలినమయిపోతుందో అన్నట్టు బెదురుతో చూసుకుంటో

ఉంటాడు. ఒడలుఅంతా కడుక్కున్న బాతులా తనని తాను చూసుకుని సంతృప్తిపడుతూ ఉంటాడు. తన ఇంట్లోతప్ప తక్కినచోట్ల ఆడవాళ్లు దేవతలని అతని విశ్వాసం. నిజానికి అతనికి ఆడవాళ్లంటే గౌరవంకంటే భయం ఎక్కువ.

అతను లేచి టేబిలుపైన ఉన్న ఫోటో తీసి ఉద్రేకంగా చూస్తోఉంటాడు. మేడమెట్లు చప్పుడవుతాయి. అతను కంగారుగా ఆఫోటో మళ్లీ గోడకి తగిలించి కుర్చీమీద కూర్చుంటాడు.]

పద్మావతి— (లోపలికి చకచకా వచ్చి) నువ్విక్కడే ఉన్నావుటోయి?

[బంగారంవంటి ఛాయ. అరటిచుక్కలా మొగం. నల్లటి కనుబొమలు మామూలుకంటె ఎక్కువగా కిందకి వంపుతిరిగి ఉంటాయి. అంత పెద్దకళ్లలో నల్లగుడ్లు చిన్నవా అనిపిస్తాయి. కళ్లు మిలమిలలాడుతూ బెదరి బెదరి చూస్తోఉంటాయి. పల్చని పొడుగుపాటి ముక్కు. నిండుపెదవులు ఎర్రరంగు పూసినట్టుగా ఉంటాయి. పైపెదవి కొంచెం ముందుకి ఎత్తుగా ఉంటుంది. కింది పెదవి చిత్రంగా వంపుతిరిగి గ్రీకుశిల్పంలా ఉంటుంది. రొమ్ము ఊపిరితో స్పష్టంగా లేచి వాలుతోఉంటుంది. మాలపిల్లచీర. దంతపునగిషీ పైటనూది. బూడిదరంగు జాకెట్టు. జాకెట్టుచేతులు భుజాలమీద భుజకీర్తుల్లా ఎత్తుగా వంపుతిరిగి ఉంటాయి. ఆమెకు స్థిరమయిన ఆత్మవిశ్వాసం ఉంది. పొగడ్తకు కొంచెం పొంగే తత్వం. కాని ఉద్రేకాలను త్రాసులా నిలపగలదు ఆమె. ఎప్పుడూ సురక్షితమయిన మార్గాన్నే అడుగులేస్తుంది. లేనిదాన్నిగురించి ఆమె ఎప్పుడూ కలలుకనదు.

ఆమె చకచకా పరుపులుచుట్టి వెనకవరండాలోంచి చీపురు తీసుకువచ్చి గది తుడుస్తోంది.]

పద్మా—అబ్బ! రోజూ అడివికింద చేసిపారేస్తారు! ఈ మొగాళ్లకి మంచీ చెడ్డా ఏమీ అక్కర్లేదు. ఎన్నిసార్లు తుడిచినా అంతే. (చాలా ఇష్టమయిన ఆటలా ఆమె తుడుస్తోంది.)

గో. కృ—అవును. మొగాళ్లకి శుభ్రం లేకపోతే ఆడవాళ్లేంచెయ్యగలరు? (తన ఒళ్లు కొంచెంగా వాసన చూసుకుని) ఇష్టంవచ్చినట్టు నానాచెత్తా గదుల్లో పారబోస్తో ఉంటే ఇంక ఇంట్లో ఆడవాళ్లు చెయ్యాలి చాకిరీ,దాసీవాళ్లలా. అందులో వాడు మరీని!

పద్మా—(అతనితో ఒప్పుకుంటో) మహా చెడ్డ కష్టం. అందులో ఆడవాళ్లు లొంగిఉంటున్నారు గనక. లేకపోతే మీఆటలు సాగుతాయా? (గుమ్మంలోకి ఊడ్చిన దుమ్ము చీపురుమీదకి ఎత్తుతో) నాలుగ్గంటలకి దాసీది తుడిచివెళ్లింది. మళ్లీ ఇంతట్లోకే! (దుమ్ము వసారాలోంచి అవతలికి పారబోసి) మీఆవిణ్ణికూడా తీసుకురావోయి, సరదాగా ఉండొచ్చు.

గో. కృ—(కొంచెం తనలో తను చిరాకుపడుతూ) ఏమిటో, ఎల్లా కుదురుతుందీ?

పద్మా—ఏమిటోయి, పెద్ద అంత చిత్రం?

గో. కృ—(నవ్వు తెప్పించుకుని) ఈ ట్రాములూ ఇవీ చూసి అసలే బెదిరిపోతుంది.

పద్మా—ఆఁ! మరీ చెపుతావు! కొత్తగా ఈవూరు వచ్చినప్పుడు నీకూ, నాకూమాత్రం తెలుసునా ఏమిటి? ఇష్టం లేకపోతే ఎన్నయినా చెప్పొచ్చు.

గో. కృ—(కొంచెం ఆదుర్దాగా) ఒదినా! నీకు తెలియదుగాని ... నిజంగా ... చాలా కష్టం దాంతో వేగడం.

పద్మా—పాపం! ఎంత కష్టం?

గో.కృ—అబ్బే! అది కాదు. నన్ను చూసేసరికి జంతువుని చూసినట్టు పారిపోతుంది. నే నెంత బోధపరిచినా అర్థంకాదు దానికి. అసలు మాయింట్లో కుదరదులే.

పద్మా—ఏమిటి కుదరడం?

గో.కృ—అంటే...... నా ......సరదాగా ఉండడం.

పద్మా— (పక్కలు దులిపివేస్తో పకపక నవ్వి) అదా? మీఅమ్మగారూ, నాన్నగారూ ఏమన్నా అనుకుంటారని నీకూ అనుమానమేనన్నమాట.

గో.కృ—నాకా? నీతో ఈవేళ చెపుతున్నాను. మాఅమ్మ,నాన్నా ఏమనుకున్నాసరే నే నసలు లెక్క

చెయ్యను, కొంచెం మా ఆవిడ అనుకూలంగా ఉంటే. అసలు దానికే భయం. కొత్తఊరు తోలుకొచ్చిన బెదురుగొడ్డులా...

పద్మా—అయినా ఆ తోలుకొచ్చేవాడిలో ఉంటుందిలే.

గో. కృ—ఆఁ ?

పద్మా—ఒక పశువుని పొరుగూరు తోలుకుని వెళ్లేవాణ్ణి ఎప్పుడయినా చూశావా ? ఎంతమందిని చూసి బెదిరినా ఆపశువు అతన్ని చూసిమాత్రం బెదరదు. నిజానికి అతను దగ్గర ఉంటే ఒక అండలా చూసుకుంటుంది. మీ ఆవిడికి నువ్వంటే అంత భయం ఎందుకుండాలి ?

గో. కృ—(కొంచెం ఇంచుమించుగా బ్రతిమాలుతూ) నిజంగా ఒదినా! నీకు తెలియదుగాని, నాలోపం ఏమీ లేదు. మా ఆవిడంత మూర్ఖురాలు ఎక్కడా ఉండదు.

పద్మా—ఆడవాళ్లంతా మూర్ఖులేనని నీ ఉద్దేశ్యం గావును.

గో. కృ—కాదు, కాదు. నిన్ను చూసినప్పుడల్లా నాకు ఏమనిపిస్తుందో తెలుసునా? ఇంత అందం, ఇంత తెలివీ, ఇంత చలాకీ అన్నీ వృథాగా పోతున్నాయని అనిపిస్తుంది. నిజంగా ...

పద్మా—(అతన్ని కొంచెం ప్రోత్సహిస్తో) ఎన్ని తెలివితేటలుంటే ఏం ప్రయోజనం? మాగతి ఎప్పుడూ వంటఇల్లే.

గో. కృ—ఎన్నటికీ కాదు. ఆడవాళ్లని అర్థం చేసుకునే మగవాడు అల్లా ఎప్పటికీ చెయ్యడు. స్త్రీ కూడా పైకి వచ్చి నలుగురితోటీ తిరగడం, ప్రపంచకాన్ని చూడడం, గొప్ప గొప్ప ఉద్యమాలు నడపడం అన్నీ చెయ్యాలి. నీ తెలివితేటలూ, నీ ప్రజ్ఞా అంతా వంటఇంటిలో మురిగిపోతూ ఉంటే నాకు చాలా విచారంగా ఉంటుంది.

పద్మా—ఏమో. మాకసలు వంటఇల్లే ఇష్టమనుకుంటాను. పైకి వచ్చి ఆడవాళ్లు ఏం చెయ్యగలరు ?

గో. కృ—(ఏం చెప్పాలో తోచక) అసంభవం... (ఉద్రేకంతో) నీకంటే తెలివితక్కువవాళ్లు, నీకాలిగోరికయినా పోలనివాళ్లు పెద్దపేరు సంపాదిస్తున్నారు- అవకాశాన్ని బట్టి.

పద్మా—నాబోటి పెళ్లాం నీకు దొరికి ఉంటే ఏం చేసిఉందువు ?

గో. కృ—(కొంచెం నిస్తబ్ధుడయి) నాకు అదృష్టం పట్టవద్దూ? నిజంగా...నాకే అంత అదృష్టం పడితే ఆమెకు ఒక స్వర్గం నిర్మించిఉందును. ఆమె కాలు కింద పెట్టనక్కర లేకుండా అన్నీ జరిగిపోయేటట్టు చేసిఉందును. ఆమెకు ప్రేమతప్ప ఇంకో ప్రపంచకం కనబడకుండా చేసిఉందును. ఆమె నొక దేవతలా ఆరాధించి ఉందును.

పద్మా—ఏమో బాబూ! నాబోటి దయితే పిచ్చెక్కి పారిపోతుంది. నువ్వా పైకి పోనియ్యవు. ఒక గుడికట్టి అంగులో పెడతావు, అద్దాల బీరువాలో బొమ్మని పెట్టినట్టుగా. పారిపోకుండా ఫలహారాలు పెడతావు. మా కంతకంటే ఇదే బాగుంది. వంట ఇంట్లోనన్నా మేము ఇష్టంవచ్చినట్టు తిరగవచ్చు.

గో. కృ—(తప్పు చేసినట్టుగా) అంటే...అబ్బే, అదంతా నిర్బంధంకోసం కాదు. నేను ఆడవాళ్లకి స్వేచ్ఛ...

పద్మా—ఎన్ని చెప్పినా మీమగవాళ్లంతా ఒకటే నోయి. (పక్క నిర్లక్ష్యంగా దులుపుతుంది.)

గో. కృ—నే నన్నది నీకర్థంకాలేదు.

[పద్మావతి టేబిలుదగ్గరకు వచ్చి పుస్తకాలు సర్దడం మొదలుపెడుతుంది. అతను కొంచెం జంకి కుర్చీలోంచి లేచి గుమ్మందగ్గరకు వస్తాడు.]

పద్మా—మీ ఆవిడ ఎందుకు అంత బెదిరిపోతోందో నాకిప్పుడు అర్థమయింది. నీధోరణి చూస్తే నాకే భయం వేసింది. ఆవిడతో కూడా అల్లాగే మొదలుపెడతావుగావును.

గో. కృ—(కోపంగా) మా ఆవిడతో అటువంటి సంగతు లెప్పుడూ ప్రస్తావించను. నీకు తెలియ

దేమోగాని, ఇటువంటి ఊహలు పురికొలిపే అందం గాని, తెలివికాని ఆమెకు లేదు.

పద్మా—అయితే నీ ఉపన్యాసాలు అందమయిన ఆడవాళ్ల కోసమే నన్నమాట.

గో. కృ—నీకు విసుగుపుడితే...... ప్రతి అందమయిన ఆడదాని దగ్గిరా ఉపన్యాసాలు ఇస్తూ కూర్చోడానికి నేనటువంటివాణ్ణి కాను.

పద్మా—(టేబిలులైటుచుట్టూ కాళీచేసి) ఓశోశ్! ఇంతలోకే ఎంతకోపం వచ్చిందోయి! (సానుభూతితో) నిజంగా నేనోయి. ఇంట్లో ఆడది తెలివయింది కాకపోతే మగవాళ్లకెంతయినా కష్టమే.

గో. కృ—పెట్టిపుట్టాలి దేనికయినా.

[గోపాలకృష్ణ మెట్లు దిగి వెళ్లిపోతాడు. పద్మావతి గదిలో దీపం వెలిగించి ఆర్పివేస్తుంది. అద్దంలో ముఖం చూసుకుంటూ 'పాపం!' అంటుంది. బద్ధకంగా ఒడలు విరుచుకుంటుంది.

గబగబా మేడమెట్లు చప్పుడవుతాయి. రామశర్మ చిరాకుగా లోపలికి వచ్చి జేబురుమాలు టేబిలు మీద విసిరి కుర్చీలో చతికిలబడతాడు.

తెల్లటి మల్లుపంచి గూడకట్టు. ఊదాచారల చొక్కా. పైబొత్తాం పెట్టుకోలేదు. కోటుకాలరు, చొక్కాకాలరు పైకి ఎత్తిఉంటాయి. కాలికి కాబూలీస్లిప్పరు. అది ఊడదీసుకోడానికి కోపంగా ప్రయత్నిస్తాడు. అది ఊడిరాదు. కొంతసేపు అతని చిరాకుకీ, ఆజోడునిర్లక్ష్యానికీ పోట్లాట జరుగుతుంది. జోడే నెగ్గుతుంది. గత్యంతరం లేక అతనే కిందకి వంగి చేత్తో ఊడదీసి మూలకంటా గిరవటేస్తాడు—ఊడదీసిన తరవాత జోడుమీద పగదీర్చుకోడానికిలాగ. జుట్టు ఒత్తుగా బిరుసుగా ఉంటుంది. కుడిపక్కని నిలువుగా గీతగీసినట్టు, పర్వతంలా నిలబడి ఉంటుంది. ఎడమపక్కని అంతకంటె చిన్న పర్వతం. వాటి శిఖరాలనించి వంకరటింకరగా కిందకి దిగి, ఎడమ పక్కపాపిడిదగ్గర అల్లిబిల్లిగా అల్లుకుపోతుంది క్రాపు—రెండు పర్వతాలమధ్య లోయని స్ఫురింపజేస్తూ. జుట్టుమూలాన్ని అసలుకంటే కోలగా అగుపడుతుంది ముఖం. మామూలుకంటె చిన్నకళ్లు, పెద్ద ముక్కు. చులాగ్గా కోపం వస్తుంది. కాని కోపాన్ని కప్పిపుచ్చగల నిర్లక్ష్యపు హాస్యం అతనిలో ఒకపాలు ఎక్కువే ఉంది. ప్రస్తుతం సిగరెట్టు గట్టిగా పీలుస్తూ ఉన్నందువల్ల అతడు ఎందుకో కోపంగా ఉన్నాడని అనుకోవాలి.]

రా. శ—ఫ్లాస్కులో కాఫీ ఉందా?

పద్మా—ఇప్పుడు ఏడుగంట లయింది.

రా. శ—(కోపం ఆపుకోలేకపోతూ) కాఫీ ఉందా అంటే......

పద్మా—ఏమి టీవేళ? రాత్రి ఏడుగంటలకి కాఫీ ఎక్కడ ఉంటుంది?

రా. శ—ఇందాకా నేను తాగలేదుగా! ఫ్లాస్కులో పోసి ఉంచమనలే?

పద్మా—అయిదున్నరదాకా చూసి రాకపోతే తాగివెయ్యరున్నారుగా?

రా. శ—(సిగరెట్టు గట్టిగా పీలుస్తాడు. వేళ్లు చుర్రుమని కాలతాయి. గట్టిగా దాన్ని నేలని వేసి కొట్టి) నాకటువంటి సమాధానాలు పనికిరావు. కాఫీ ఉందా లేదా అంటే అడ్డదిడ్డంగా సమాధానాలు చెపుతావేం?

పద్మా—నాకు ఇల్లా అయితే అసలే పనికి రాదు. ఇప్పటిదాకా పాడుసిగరెట్టుపీకలు ఎత్తిపొయ్యడంతో సరిపోయింది. ఇష్టం వచ్చినట్టు గది అంతా జిమ్మిపారెయ్యడం!

రా. శ—మాటకి మాట అనడం ఒకటి అలవాటు అయింది.

పద్మా—(తాపీగా) స్త్రీ స్వాతంత్ర్యం.

రా. శ—(కొంచెం తగ్గి కుర్చీలో వెనక్కి జేర్లబడతాడు) నన్ను ఆట్టే విసిగించకు. చాలా చిరాకుగా ఉంది. అట్టే హద్దుమీరితే చెయ్యి చేసుకుంటానేమోకూడాను.

పద్మా—ఆ అందమూ చూద్దాం. కానియ్యండి.

రా. శ—(అనుమానంగా) ఎంతోసేపు అనుకున్నావా? ఏమిటో అనుకుంటున్నావులా ఉంది.

పద్మా—విసుగూ, చిరాకూ నాకూ ఉంటాయి. నేనూ మనిషినే. నన్ను విసిగిస్తే ఒక్క క్షణమయినా ఇక్కడ ఉండను.

రా. శ—(చులకనగా) పుట్టింటికి! అదో పెద్ద బెదిరింపు!

పద్మా—(గట్టిగా) బెదిరింపులు, గిదిరింపులు నాకు తెలియవు. ఈ చాకిరీ అంతా నేను చెయ్యలేను. నే నసలు వేగలేను ఇల్లాయితే. ఈగది రోజూ మూడువందలసార్లు తుడిచేసరికి నా నవనాళ్లూ కుంగిపోతున్నాయి. వీథి మొగం చూడ్డానికి తీరిక ఉండదు. నేనే పెద్ద సుఖపడిపోతున్నా ననుకుంటున్నారు పాపం. మీకేగావును అంతకోపం.

[రా. శ., పద్మా. ఒకరికంటే ఒకరు గట్టిగా మాట్లాడడానికి ప్రయత్నం చేస్తూ—]

రా. శ—నువ్వు నన్ను బెదిరించ నక్కరలేదు. వెడితే తక్షణం వెళ్లు, పాపం, సిగరెట్టుపీకలు ఎత్త లేకపోతే.

పద్మా—నేనూ మీకంటే ఎక్కువే కోప్పడగలను, ఏమనుకుంటున్నారో!

[కిటికీఅవతల గోపాలకృష్ణ నెమ్మదిగా వస్తో కనిపిస్తాడు. ఇద్దరూ చటుక్కుని ఆగిపోతారు. రామశర్మ సిగరెట్టు ముట్టించి, అలవాటుచొప్పున అగ్గిపుల్ల కింద పారవెయ్యబోయి, పద్మావతిని చూసి కిటికీలోంచి గిరవాటేస్తాడు. అది కిటికీకి తగిలి ఇవతలే పడిపోతుంది.]

పద్మా—(గదిలోంచి అవతలికి వెళ్లిపోతో, గోపాలకృష్ణతో, కోపంగా) భోజనానికి రావోయి.

రా. శ—(తనూ కోపంగానే) నువ్వు వెళ్లి తినరా, నాకు ఆకలి వెయ్యడం లేదు.

[ముందు పద్మావతీ, ఆమె వెనక కొంత అనుమానంగా గోపాలకృష్ణా వెళ్లిపోతారు. రామశర్మ సిగరెట్టుపీక, కిందపడిన అగ్గిపుల్ల తీసి జాగ్రత్తగా కిటికీలోనించి అవతలకి పారవేస్తాడు. టేబిలుకిందనుంచి సబ్బుపెట్టే, కుర్చీమీద ఉన్న తువ్వాలూ తీసుకుని ఒకసారి గదిలో నాలుగుమూలలా చూస్తాడు. తరవాత ఎలెక్ట్రిక్ దీపం ఆర్పివేస్తాడు. గది చీకటి అయిపోతుంది.

*        *        *        *

గదిలో ఎలెక్ట్రిక్ దీపం వెలుగుతుంది. గోపాలకృష్ణ కుర్చీలో కూర్చుంటాడు. రామశర్మ తల తుడుచుకుంటూ చేతిలో సబ్బుబిళ్లపెట్టె పట్టుకుని వస్తాడు. ఆ పెట్టె బల్లకింద పెట్టి దువ్వెన తీసి అద్దంలో చూసుకోకుండానే తల దువ్వుకుంటాడు]

రా. శ.—(చటుక్కున జ్ఞాపకం వచ్చినట్టు) మీ నాన్న ఉత్తరం వ్రాశాడురా.

గో. కృ—నీ కెందుకు రాశాడు, నాకు రాయక?

రా. శ.—ఏదో చాలా రాశాడు. మొన్న నువ్వు శలవల్లో ఇంటికి వెళ్లినప్పుడు నిన్ను చూస్తే పాడయిపోతున్నట్టు అనుమానం తగిలిందట. నీ మెడలో జంధెం ఉందో లేదో, సంధ్యావందనం చేసినా చెయ్యక పోయినా, భోజనంముందు పరిషేచనం చేస్తున్నావో లేదో వగైరా సంగతులన్నీ జాగ్రత్తగా చూస్తూ ఉండమని రాశాడు.

గో. కృ—నువ్వు మహా అక్షరాలా ఇవన్నీ పాటిస్తున్నట్టుగా. నువ్వింక నన్ను జాగ్రత్తగా చూస్తావు!

రా. శ—(కులాసాగా) నా కింక అవన్నీ వర్తించవని మీ నాన్నకి తెలుసురా. అవన్నీ దాటిపోయాననో, నాకు అనవసరమనో ఆయననమ్మకం.

గో. కృ—అదేమీ కాదు. నువ్వు పూర్తిగా చెడిపోయావనీ, ఇంక నిన్ను బాగుచెయ్యడం బ్రహ్మతరంగాదనీ ఆయననమ్మకం. అందుకే నన్ను చెడిపోకుండా చూడమని నీకు రాశాడు.

రా. శ—మొత్తంమీద నన్నుగురించి ఏదో ఒక దృఢమయిన అభిప్రాయం అందరికీ ఉంది. నిన్నుగురించి అందరికీ అనుమానమే.

గో. కృ—నాకేమీ అనుమానం లేదులే. నీ సంగతి పూర్తిగా అందరికీ తెలిస్తే ఆ దృఢమయిన అభిప్రాయం ఏమిటో అప్పుడు తేలాలి.

రా. శ—అదేమిటో కొంచెం చెపుదూ.

గో. కృ—నీకు డాబు ఎక్కువ. అంతా నిన్ను నాగరికుడు అనుకోవాలని జంధ్యం తీసిపారేస్తావు. అందరిముందూ నాగరికులు అనుకునేవాళ్లు ఎల్లా నడుచుకుంటారో అల్లా నడుచుకోడానికి ప్రయత్నిస్తావు. పెద్దవాళ్లముందు నీకు సిగరెట్టు కాల్చడానికి అధికారం ఉందని చూపించడానికి, దర్జాగా సిగరెట్టు ముట్టించి, అల్లా చేసినందుకు అడకువ నటిస్తూ వారి అనుజ్ఞ వేడుకుంటూావు. మన చుట్టాల ఇళ్లకి వెళ్లినప్పుడు, నీకు గూడకట్టుతప్ప పంచికట్టు రాదని వాళ్లనుకునేటట్టు నటిస్తావు. అసలు ఎవరింట్లో వాళ్లు ఉన్నప్పుడు గాని ఎవరి నాగరికతా తెలియదు.

రా. శ—ఎంత బాగా అన్నావురా! అచ్చంగా నేను అల్లాగే అనుకుంటానుసుమా!

గో. కృ—అయినా నువ్వెలా నడుచుకుంటేనా కెందుకులే. మా నాన్న నీకు ఉత్తరం రాశాడంటే ఆమాటమీద వచ్చిందిగాని.

రా. శ—ఊఁ. మీ నాన్నకి నీమీద నే నేదో రాసేస్తా ననుకుంటున్నా వేమిటి? నువ్వు జంధ్యం రోజూ సబ్బుతో రుద్దుకుంటున్నావనీ, ఏదో సంధ్యావందనం పుస్తకంవంటిది కొని రోజూ చదువుతున్నావనీ, పట్టుపంచి కట్టుకుని మరీ భోజనం చేస్తున్నావనీ...

గో. కృ—ఆమట్టుని మా నాన్న పొంగిపోయి "నిజంగా మన రామశర్మనండీ కుర్రవాడంటే! ఏం బాగారాశాడు? ఏదో నాగరిక పిచ్చలో పడ్డా మొత్తం మీద మంచి కుర్రవాడండీ" అంటూ నలుగురిదగ్గరా పొగుడుతాడు. నీ నాగరికత ఏమిటో నాకు తెలుసు. ఇంట్లోకి వచ్చేసరికి ఇంత హంగామా...... (అనుమానిస్తాడు.)

రా. శ—ఊఁ! ధైర్యంగా అను అనే దేమిటో.

గో. కృ — పెద్ద చెప్పాలేమిటి? ఇంట్లో భార్యని సుఖపెట్టలేకపోతే మగవాడి నాగరికత ఏమిటి? నలుగురిలోనూ పెద్ద స్త్రీస్వాతంత్ర్యపు కబుర్లు చెపుతో, ఇంట్లోమాత్రం ఆ ఆటలేవీ సాగవన్నట్టు నడుచుకునేవాళ్లని చూస్తే నాకు ఎంతమాత్రం గౌరవం లేదు.

రా. శ—ఓరి నీ గౌరవం బంగారంగానూ! నాకు అక్కరలేదురా అది. మా ఆవిడికి ఇంట్లో స్వాతంత్ర్యం ఉందో లేదో దానికి తెలియాలి గాని నీకూ నాకూ ఏం తెలుస్తుంది?

గో. కృ—నీకు తెలియదేమో గాని, నాకుమాత్రం సంపూర్తిగా తెలుసును. ఇంతకుముందేగా పెద్దయుద్ధం జరుగుతా? "ఇల్లా అయితే నే నింక వేగలేను" అనలేదూ ఆమె?

రా. శ—రోజూ అల్లా అంటూనే ఉంటుంది. కాని చివరకి బలవంతంగా పంపించేద్దా మనుకున్నా పుట్టింటికి వెళ్లదు. నేను కోపంగా కేకలువేస్తే తనూ వేస్తుంది. (తాపీగా కుర్చీలో కూర్చుని) ఇందులో ఒక రహస్యం ఉందిరా అబ్బాయి. నా స్వాతంత్ర్యం కాపాడుకోడానికి నేను గట్టిగా కేకలువేస్తూ ఉంటాను. నేను అడకువగా ఉంటే నా ఇష్టంప్రకారం ఒక్కపనికూడా జరగదు. అదీ నాభయం. దానికీ అంతే. దానిమాట నిలబెట్టుకోడానికి అది బెదిరిస్తుంది. కాని మామూలుగా ఏదో కులాసాగానే గడచిపోతుంది. నిజంగా అది తలుచుకున్నపని నాచేత చేయించితీరుతుంది. అందుకే ఈ కేకలూ, ఈ చిరాకూ.

గో. కృ—ఎవరిమట్టుకు వారి కేదో సంతృప్తి లేకపోతే వీల్లేదులే. నిజం తెలుసుకున్నతరవాతగాని మన పొరబాట్లు మనకి తెలిసిరావు. నీకు నచ్చినా నచ్చకపోయినా నిజం చెపుతాను. మీ ఆవిడబతుకు అంతకంతకీ నీమూలంగా కష్టమయిపోతోంది.

రా. శ—మరేమీ ఫరవా లేదు. తన్ను తాను కాపాడుకోగలదు అది. ఆడవాళ్లంటే ఏమి టనుకుంటున్నావు? పైకి చిరాకు నటిస్తారు-మగవాళ్లని కొంత తబ్బిబ్బుచెయ్యడానికి. మళ్లీ మగవాడు సుఖపెట్టదలుచుకుంటే ససేమిరా ఒప్పుకోరు. వాళ్లకి చిరాకు నటించడానికి అవకాశాలు దొరకాలి. ఇంట్లో చాకినీ

అనే దొకటి ఉంటే ఆవంక పెట్టి మగవాళ్లమీద విసుక్కోవచ్చు. కాని ఇంట్లోచాకిరీ ఒదుల్చుకోడానికి వాళ్లు చస్తే ఒప్పుకోరు. అయినా, ఆమాత్రం దెబ్బలాటలు లేకపోతే ఏం సరదా ఉంటుంది?

గో.కృ—నీకుమాత్రం సరదాగా ఉందేమోగాని ఇదంతా ఆమె కేమాత్రం సరదాగా లేదు. ఆమె నాదగ్గర అన్న ఒక్కట్లనిబట్టి నేను అర్థంచేసుకున్నాను. ఆమె తక్కిన ఆడవాళ్లవంటిది కాదు. ఆమె పడుతున్న కష్టాలు నేను చూడలేకుండా ఉన్నాను. ఆమె ఒక దేవతవంటి మనిషి. నీచేతిలో పడి నలిగిపోతోంది.

రా. శ—(మొదటిసారి కొంచెం కోపం కనబరుస్తూ) ఆమెను నేను ఎల్లాచూస్తే నీకేమమ్మా?

గో. కృ—ఒకరు ఏమనుకుంటారో అని నేను భయపడను. నాలో నాకు విశ్వాసం ఉంది. ఆమెకష్టాలన్నీ నాకష్టాలుగా భావించుకుంటాను. ఆమె సంతోషిస్తే నేనూ సంతోషిస్తాను. ఆమె చిరాకుపడితే ...

రా. శ—(కుర్చీలో ముందుకి వంగి) అంటే దాని అర్థం? (వెనక్కి జేర్లబడి కోపం కప్పిపుచ్చుతో) నీకు భ్రమించేటంత అందమయిన భార్య ఉన్నందుకు నేను గర్విస్తున్నాను. కాని నువ్వు ఊరికే మూర్ఖుడవయిపోకు.

గో. కృ—ఇందులో ఎవరు మూర్ఖులో ఆమెకే తెలియాలి. నాహృదయం ఆమెకు తెలియకపోలేదు.

రా. శ—(కోపం ఆపుకోలేకపోతూ) ఏమొగం పెట్టుకుని చెపుతున్నావురా ఇదంతా నాకోటి? అందులో ఆమెకు తెలుసననికూడా?

గో. కృ—నేను ఆవిషయమయి సిగ్గుపడనక్కరలేదు. ఆమె తన కష్టాలన్నీ నాతో చెప్పుకుంటోనే ఉంది. ఆమెకు తోడుగా ఉండడానికి మాఆవిడిని తీసుకురమ్మంది కూడాను. ఆమెను నేను......

రా. శ—(కుర్చీలోనించి లేచి) వేళాకోళమనుకున్నావా? మళ్లీ ఊపిరి అందకుండా చేస్తాను తెలిసిందా? (చొక్కా చెయ్యి పైకి మడుస్తాడు.)

గో. కృ—నాహృదయానికి కవచం ఉంది. దాన్నిమాత్రం నువ్వు ముట్టుకో లేవు.

రా.శ—నోరు మూస్తావా లేదా? గుండు రామకీర్తనపాడిస్తాను, తెలిసిందా? నీహృదయం ఏమిటో పైకి లాగి చూపిస్తాను. నువ్వు దొంగవు, మోసగాడవు. సున్నంలోకి ఎముక లేకుండా పొడి చెయ్యాలి.

గో. కృ—(తనూ లేచి) నువ్వేం చెయ్యగలవో చేసుకో. ఆట్టే బెదిరించ నక్కరలేదు.

[ఇద్దరూ ఒకరితో ఒకరు కలియబడడానికి వీలుచూసుకుంటో సంద్రంగా కోడిపుంజుల్లా తిరుగుతో ఉంటారు.

మేడమెట్లు చప్పుడవుతాయి. ఇద్దరూ కంగారుగా విడిపోతారు. రామశర్మ కుర్చీలో కూర్చుని ఈలపాడడానికి ప్రయత్నిస్తాడుగాని ఊపిరి అందదు. గోపాలకృష్ణ చేతులు కట్టుకుని గబగబ పచారుచేస్తో ఉంటాడు. పద్మావతి ఇద్దరినీ తేరిచూస్తుంది]

పద్మా—(రామశర్మతో) అన్నంవడ్డించాను రండి.

రా. శ—(చకితుడయి) నాకు ... అన్నం ... నేను...

పద్మా—అబ్బ! రద్దురూ. నాకు పొద్దుపోతుంది. ఇల్లంతా కడుక్కోవాలి.

రా. శ—నాకు ఆకలి లేదంటో ఉంటే.

పద్మా—ఊరికే మజ్జిగాఅన్నం తిందురుగాని రండి.

[రామశర్మ సమాధానం చెప్పలేక అవతలికి వెళ్లిపోతాడు. గోపాలకృష్ణవేపు ప్రశ్నార్థకంగా చూస్తో—]

పద్మా—ఏమిటోయి ఈ కేకలు?

గో. కృ—(కంగారుగా)ఏమీలేదు...నేను... ఏదో అంటే వాడికి కోపం వచ్చింది.

పద్మా—ఏమన్నావు?

గో. కృ— ( కొంచెం అనుమానిస్తూ ) వాడు పెట్టే బాధలు నువ్వు భరించలేకుండా ఉన్నావని.

పద్మ—(జడలో పువ్వులు సవరించుకుంటూ) అదా ?... అయితే ఏంలే. మంచిపని చేశావు.

[పద్మావతి వెళ్లిపోతుంది. గోపాలకృష్ణ ఏదో అనబోయి అనుమానిస్తాడు. ఇటూ అటూ పచారు చేస్తాడు. చివరికి ఒక నిశ్చయానికి వచ్చినట్టుగా, ఎడమపక్కని ఉన్న కాంపుకాటు, పరుపు వసారా లోకి తీసుకు వెళతాడు. వెంటనే తిరిగి వస్తాడు. కిటికీలోంచి అవతలికి ఒకసారి తొంగి చూస్తాడు. టేబిలుమీద ఉన్న ఫోటోని తదేకదీక్షతో కొంత సేపు చూస్తాడు. గుండెమీద చేత్తో తడుముకుంటూ ఒక నిట్టూర్పు విడుస్తాడు. మేడమెట్లు చప్పుడవు తాయి. చటుక్కుని అవతలికి వెళ్లిపోబోతాడు. గుమ్మందగ్గర రామశర్మ ఎదురవుతాడు. ఇద్దరూ ఒక ముహూర్తం ఒకరినొకరు పరికించుకుంటూరు. రామ శర్మ గదిలోకి వస్తాడు. గోపాలకృష్ణ వసారాలోకి వెళ్లిపోతాడు.]

రా. శ—(కుర్చీలో కూర్చుని ఒక పుస్తకం తెరిచి)

"పలుకుల్ తేనియ, లొల్కు రాచిలుక సంభాషింపదేలా ..."

పద్మ—(వసారాలో) ఏమోయి అప్పుడే నిద్ర పోతున్నావేమిటి ?

[రామశర్మ పుస్తకం మూసివేస్తాడు. పద్మావతి 'అమ్మయ్య' అంటూ పక్కమీద ఒకపక్కని పడు కుంటుంది. ఒడలు విరుచుకుంటుంది.]

రా. శ—ఏమేవు !

పద్మ—(ముడుచుకుని పడుకుంటూ) నాకు నిద్ర వస్తోంది బాబూ.

రా. శ—(జంకుతో పక్కకి వచ్చి కూర్చుని, మీద చెయ్యివెయ్యబోయి) ఏమేవు !

పద్మ—ఏమిటది ? (రామశర్మ లేచి గదిలో పచారుచేస్తాడు.)

"ఇంకా దీపం ఆర్పివెయ్యడానికి వీలులేదా ఏమిటి?"

రా. శ—నేను చదువుకోవాలి.

పద్మ— ఆ వసారాలోకి వెళ్లి చదువుకో కూడదూ ?

రా. శ—(ధైర్యంగా) అల్లా వీలులేదు.

పద్మ—పోనీ, నేనే వెళ్లి ఆ వసారాలో పడు కుంటాను. (పక్కమీద లేచి కూర్చుంటుంది.)

రా. శ—(ఏమీ తోచక)ఉండు. నీతో కొంచెం మాట్లాడాలి.

పద్మ—(లేచి ఒక కుర్చీమీద కూర్చుని) ఏమిటది ?

రా. శ—(ఆమెకు ఎదురుగా ఇంకో కుర్చీ ఈడ్చుకుని కూర్చుని గొంతు సద్దుకుంటాడుకాని, మాట రాదు.)

పద్మ—ఏమిటో తొందరగా చెప్పరాదూ ?

రా. శ—(కొంచెం ఇంకోపక్కకి తిరిగి)అబ్బే! ఏమీ లేదు...ఏదో అడుగుదా మనుకున్నాను...ఆ! మరీ...దాసీది చెప్పినమాట వింటోందా ?

పద్మ—(పకపక నవ్వుతో) ఏం ప్రశ్న ? ఎంతసేపు ఆలోచించారు !

రా. శ—ఏం ప్రశ్న ఏమిటి ? రోజూ దెబ్బ లాడే దాసీదయితే నాకసలు తలనొప్పి. ఈవేళ మరి గది తుడవకుండా ఎందుకు వెళ్లిపోయింది ?

పద్మ—తుడవలేదని ఎవ రన్నారు ? నిక్షే పంలా తుడిచింది.

రా. శ—మరి నువ్వు తుడిచా నన్నట్టున్నావు ఇందాకా ?

పద్మ—అది తుడిస్తేమాత్రం నేను తుడవకుం డా అవుతుందా ? అది వెళ్లిపోయినతరవాత మూడు సార్లు తుడిచాను.

రా. శ—ఇంకోరూపాయి ఇద్దాం, సాయంత్రం దాకా ఉండమను. నిన్న ఆస్తమానూ గది ఊడవ మన్నానా ఏమిటి ?

పద్మ—ఇప్పుడిల్లా అంటారు, రేపు ఇంకో లా అంటారు. మాటకి ఏమన్నా స్థిరం ఉంటేగా ?

రా. శ—ఓస్. ఎప్పుడూ మాట తప్పుతో ఉన్నట్టుగా. అయినా ఇంట్లో వెట్టి చాకిరీ అంతా నువ్వెందుకు చెయ్యడం ?

పద్మా—అబ్బా ! పోనిద్దురూ ఊరికేను. ఎంత చెప్పినా మన గోపాలకృష్ణ అన్నట్టుగా......

రా. శ—ఏం, ఏమన్నా డేమిటి ?

పద్మా—ఏదో అన్నాడు.

రా. శ—రహస్యమా ?

పద్మా—ఆ, రహస్యమే.

రా. శ—(కొంచెం కోపంగా) నీ కేదన్నా కష్టంగా ఉంటే ముఖాముఖీని నన్నడిగితే తేలిపోతుంది. అంతేగాని డొంకతిరుగుడుగా చెపితే నాకేమీ అర్థంగాదు.

పద్మా — చెప్పేందు కేముంది ? (లేచి తన ఫోటో తీసి దులుపుతూ) అతని పెళ్లాన్ని కూడా తీసుకు రమ్మన్నాను.

రా. శ— (చటుక్కున లేచి) అదేమీ కుదరదు. అందులో వాడికీ నాకూ—మనకీని. అయినా వాళ్ల నాన్న అసలు ఒప్పుకోడు.

పద్మా—ఏదో అన్నాను. ఇంతలోకే అతను తీసుకువచ్చేయ్యడు లెండి.

రా. శ—అయినా, అనడం ఎందుకని ?

పద్మా—మాటసందర్భాన్ని అన్నాను. అదీ తప్పే ? మీకు అన్నీ తప్పులే.

రా. శ—వాడు ఉత్త చవట, దొంగ.

పద్మా—ఎందుకండీ పాపం అతన్ని అల్లా అంటారు ? ఉత్త అమాయకుడండీ.

రా. శ—అమాయకుడా ? వాడికేమన్నా నీతీ నియమం ఉందా ? అమ్మో ! వాడు ఎంతకయినా తగును. ఉత్త వెర్రిముండావాడిలా కనబడతాడు పైకి. అసలుసంగతి ఎవరికీ తెలియదు. వీలు అయినప్పుడల్లా వాడికి వాతలు వేస్తో ఉండాలి.

పద్మా— అతనంటే ఎందుకండీ అంతకోపం మీకు? (రామశర్మ లోపల ఉరుముకుంటాడు. పద్మావతి పక్కమీదికి వెళ్లి బోర్లగిల పడుకుంటుంది.) అబ్బా ! పగలల్లా చాకిరీతో సరిపోతుంది. కాస్త నిద్రపోదామంటే ఈ దీపం ఒకటి.

రా. శ—పోనీ, దీపం ఆర్పివెయ్యనా ?

పద్మా—ఉహూ ! వద్దు. చదువుకోండి.

రా. శ—నువ్వంతగా చేసుకోలేకుండా ఉంటే పోనీ వంటమనిషిని ఎవరినయినా ...

పద్మా—అదొక్కటే తక్కువయింది !

రా. శ—చేసుకోలేనప్పు డేం జేస్తాం ?

పద్మా—గొడవ పెట్టకండి బాబూ, నాకు నిద్ర వస్తోంది.

[రామశర్మ సిగరెట్టు ముట్టించి అగ్గిపుల్ల జాగ్రత్తగా అవతల పారవేస్తాడు.]

రా. శ — ఈ వేళ ఇంటికేమీ ఉత్తరాలు రాలేదూ ?

పద్మా—మీకేమీ రాలేదు.

రా. శ—నీ కేమన్నా వచ్చాయేమిటి ?

పద్మా—ఏవో ... మా అన్నయ్యకి మగపిల్లవాడుట. అచ్చంగా నాలా ఉంటాడుట.

రా. శ—(కొంచెం ధైర్యంగా వెక్కిరిస్తో) అయితే మహామంచి బాగుంటాడు.

పద్మా—పోనీయండి. మీకు అందంగా కనబడకపోయినా నేను చాలామందికి అందంగా కనబడతాను తెలుసునా?

రా. శ— అనుకునేవాళ్లంతా చవటలయితే వాళ్ల అభిప్రాయం లెక్కలోనికాదు.

పద్మా—నేను అందంగా ఉన్నానని ఇంకొకళ్లు అనుకుంటే మీకు ఎందు కంత కోపం?

రా. శ—(కోపంగా) నా కేమీ కోపంలేదు. (పద్మావతి దీపంవైపు చూస్తో నవ్వుతుంది) ఎందు కల్లా నవ్వుతావు? నాకు అసహ్యం అల్లా నవ్వితే.

పద్మా—పాపం, గోపాలకృష్ణ చాలా బాధ పడుతున్నాడండీ!

రా. శ—(చర్రున పద్మావతివైపు తిరిగి) వాడి మాట నాదగ్గర తేవద్దు, తెలిసిందా?

పద్మ—అత నేం చేశాడు?...ఆ కిందవసారాలో పడుకుని అతను ఏమనుకుంటో ఉంటాడో తెలుసునా? అతనికి నిద్రరాదు. మీరు నన్ను చంపేస్తూఉంటారనీ, నేను అభిమానంకొద్దీ గట్టిగా ఏడవలేక లోపలలోపలే బాధపడుతో ఉంటాననీ, ఏవో ఏవో ఊహించుకుంటో పడుకుంటాడు. (రామశర్మ తెల్లబోయి పద్మావతివేపు చూస్తోఉంటాడు.) పొద్దున్న లేచి, నావంటిమీద దెబ్బలేమన్నా ఉన్నాయేమో అన్నట్టు అనుమానంగా చూస్తాడు. అతను ఊరికే బాధపడిపోతాడు. అతన్ని చూస్తే, పాపం, జాలీ వేస్తుంది, నవ్వూ వస్తుంది.

రా. శ—(కొంచెం సిగ్గుపడినట్టు చేత్తో ముఖం కప్పుకుని) ఏమోగాని వాడే కాదు, మేమంతా ఉత్త మూర్ఖులం, మగవాళ్ల మంతాను!

